క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డులో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 29వ వార్డు సొసైటీ కాలనీలో రూ.75 లక్షలతో చేపట్టనున్న డిస్పోజల్ డ్రైనేజీ కాలువ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. పాలక వర్గం వచ్చాక నగరం పురోభివృద్ధిలో పయనిస్తుందన్నారు. పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి అవినీతి రహితంగా పాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కర్నూలు, అన్నమయ్య జిల్లాల మహిళా విభాగం ఇన్‌చార్జ్ (కార్పొరేటర్) శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య శుక్రవారం పట్టణ ఆరోగ్య కేంద్రాలైన ఎన్‌టీఆర్ కాలనీ, ఇందిరమ్మ హౌసెస్‌లను సందర్శించి తనిఖీ చేశారు. అక్కడ నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలో, కాలనీల్లో మురికికాలువలను శుభ్రపరచాలని చెప్పారు. పంచాయతీ వారితో కలిసి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు సూచనలు, సలహాలు అందజేశారు.

డాక్టర్ స్వరూపరాణికి ఘన సన్మానం



కర్నూలు(హాస్పిటల్): 32 సంవత్సరాల పాటు వైద్యసేవలందించి పదవీ విరమణ చెందుతున్న కర్నూలు మెడికల్ కాలేజీ ఫార్మకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి. స్వరూపరాణిని శుక్రవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ డాక్టర్ స్వరూపరాణి చేసిన సేవలను కొనియాడారు. ఆమె వివిధ పదవులను నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

8 నుంచి ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

కర్నూలు(సెంట్రల్): జనవరి 8,9,10 తేదీల్లో ఏపీ రైతు సంఘం 18వ రాష్ట్ర మహాసభలను రాజమండ్రిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు.

ఐఏఎల్ క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు (లీగల్): నూతన సంవత్సరం 2024 కాలమాన పట్టికను శుక్రవారం ఐఏఎల్ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్) జిల్లా ప్రధాన కార్యదర్శి రవికాంత్ అధ్యక్షతన జరిగింది. బార్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు బి.చంద్రుడు, శేషన్న, జగదీష్, ఇక్బాల్ తదితరులు పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు.

కొనసాగుతున్న దీక్షలు

కర్నూలు (లీగల్) : ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైట్లింగ్ చట్టం, జీవో నెం.512ను రద్దు చేయాలని ధర్నా చౌక్‌లో న్యాయవాదులు నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు19వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షలో లా ప్రసూన కాలేజీ విద్యార్థులు బాలాజీ రెడ్డి, పరమేశ్వరరెడ్డి, మురళీకృష్ణ, మహేష్, హరిబాబు, ప్రేమ్ కాంత్, అన్వేష్, సునీతారెడ్డి, జువైద్, సుభాషిణి దేవి కూర్చున్నారు.

పెండింగ్ క్లెయిమ్స్‌ను త్వరగా పరిష్కరించండి

కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితా సవరణకు సంబంధించి పెండింగ్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా సవరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జనవరి 12లోపు పూర్తి చేయాలన్నారు. అలాగే ఫొటోగ్రాఫిక్, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్‌ను కూడా పరిశీలించాలన్నారు. పీడబ్ల్యూ ఓటర్లను పూర్తిస్థాయిలో అప్‌డేట్ చేసేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, జిల్లాలోని ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ ఆయనకు వివరించారు. కాన్ఫరెన్స్‌లో కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు, ఈఆర్‌ఓ మల్లికార్జునుడు పాల్గొన్నారు.

8న టెంకాయల వేలం

కర్నూలు(సెంట్రల్): జగన్నాథగట్టు రూపాలసంగమేశ్వర స్వామి ఆలయంలో టెంకాయల విక్రయానికి జనవరి 8వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ ప్రసన్నలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. వివరాలకు దేవస్థానం కమిటీని సంప్రదించాలన్నారు.

ఆధునిక వైద్యం.. అపురూపం

- ఆధునిక చికిత్సల్లో ప్లాస్టిక్ సర్జరీ ముందంజ
- రూపం కోల్పోయిన వారికి యథా స్థితికి తెచ్చే సర్జరీలు
- ఏటా వెయ్యికి పైగా అరుదైన ఆపరేషన్లు
- కాలిన గాయాల రోగులకు స్వాంతన
- అత్యాధునిక మైక్రోస్కోప్‌తో ఆపరేషన్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీజీ సీట్లు మంజూరుతో పాటు పలు వైద్య పరికరాల ఏర్పాటు
- ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి నూతన భవనం

తెగిన చేతిని మళ్లీ అతికించడం, తెగిపడిన తలను మళ్లీ మంత్రదండంతో సరిచేయడం పాత జానపద సినిమాల్లో మాత్రమే చూసుంటాము. ఆధునిక వైద్యరంగంలో ఇప్పుడు అది సాధ్యమవుతోంది. నిర్ణీత సమయంలో తెగిపడిన శరీర భాగాలను తీసుకొస్తే అతికించడం ఇప్పుడు పెద్ద కష్టం కాదు. దీనికి ప్రభుత్వ ప్రోత్సాహం తోడైతే వైద్యులు వారి వైద్యానికి మరింత వన్నెలద్దుతారు. ఇందుకు ప్లాస్టిక్ సర్జరీ వైద్యవిభాగంలో జరుగుతున్న అద్భుతాలే నిదర్శనం.



ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో రోగులకు సేవలందిస్తున్న వైద్యులు



ప్లాస్టిక్ సర్జరీ విభాగం



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఒకప్పుడు ఒక్కరే డాక్టర్ ఉండేవారు. ఈ విభాగంలో ఆపరేషన్ చేయించుకోవాలంటే నెలల తరబడి వేచి ఉండాల్సిందే. ఈ క్రమంలో ఈ విభాగంలో క్రమంగా వైద్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఒక ప్రొఫెసర్ డాక్టర్ మంజులబాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ స్వతంత్ర భారతి, డాక్టర్ విజయచంద్రమౌళి, డాక్టర్ సింధు ప్రియాంక ఉన్నారు. 2020లో ఈ విభాగానికి ఒక పీజీ సైతం రావడంతో ప్రస్తుతం ముగ్గురు పీజీలు వైద్యం చేస్తూ విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో ఒకప్పుడు ఆపరేషన్‌కు నెలల తరబడి ఎదురుచూసే పరిస్థితి నుంచి ప్రస్తుతం వారం, పదిరోజుల్లో పూర్తవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రూ.2.5 కోట్ల విలువ గల మైక్రోస్కోప్ పరికరంతో ఈఎన్‌టీతో పాటు ఈ విభాగమూ అత్యాధునిక ఆపరేషన్లు నిర్వహిస్తోంది. దీంతో పాటు ఇటీవల రెండు బాయిల్స్ ఆపరేటర్స్, రెండు సక్షన్ ఆపరేటర్స్, ఒక సియామ్ మిషన్‌ను, మొబైల్ ఆపరేటింగ్ ఫోకస్ లైట్ కొనుగోలు చేసి ఇవ్వడంతో శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు మరింత సులువైంది. ప్లాస్టిక్ సర్జరీతో పాటు కాలిన గాయాలకూ ప్రత్యేక విభాగం ఇక్కడ ఏర్పాటు చేశారు. 20 పడకలకు పైగా ఉన్న ఈ విభాగంలో నిత్యం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సేవలందిస్తుంటారు.

నిర్వహిస్తున్న శస్త్రచికిత్సలు

ప్లాస్టిక్ సర్జరీలో భాగంగా గ్రహణ మొర్రి, పుట్టుకతో వచ్చే అంగవైకల్యాలను సరిచేయడం, ఫేషియల్ సర్జరీ, ట్రామా అండ్ మ్యాక్సిలో ఫేసియల్ ఫ్రాక్చర్స్, రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీ, కాస్మోటిక్స్, ముక్కు సర్జరీ, ముఖంపై గాయాలు, చేతిగాయాలకు చికిత్స, చర్మం వేయడం, ఫ్లాప్ సర్జరీ, హైపోస్పెడియాసిస్, కాలినగాయాలకు చికిత్స, గైనకోమాస్టియా(మగవారిలో పెరిగిన రొమ్ములను సరిచేయడం), రొమ్ము పెంచడం వంటి శస్త్రచికిత్సలను నిర్వహిస్తున్నారు.




ఆపరేషన్‌కు ముందు, తర్వాత

నాలుగేళ్లుగా వైద్యసేవలు

సంవత్సరం	ఓపీ రోగులు	ఐపీ రోగులు	శస్త్ర చికిత్సలు
2020	1,423	356	263
2021	3,960	823	972
2022	4,612	968	1,023
2023	3,686	817	1,362

ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి నూతన భవనం



నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్ (ఎన్‌పీపీడీబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం 2017 మార్చిలో రూ.4.5 కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఇందులో రూ.2.5 కోట్లను కేంద్రం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉన్నా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2019 వరకు మంజూరు చేయలేదు. అయితే, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభమయ్యాయి. ఈ భవనంతో పాటు ఆధునిక వైద్యపరికరాలు రానున్నాయి. అలాగే అదనంగా వైద్య సిబ్బంది నియమితులవుతారు. దీంతో ప్లాస్టిక్ సర్జరీ, కాలిన రోగుల విభాగాలకు వచ్చే రోగులకు మరింత నాణ్యమైన వైద్యం అందే అవకాశం ఉంది.

అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నాం



ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం వైద్యులు ఉండటంతో పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీంతో పీజీ వైద్యులు కూడా వచ్చారు. వైద్యుల సంఖ్య పెరగడంతో ఇక్కడ చేరే రోగులకు సత్వర చికిత్స, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. రోగి ఆసుపత్రిలో చేరిన వెంటనే అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాము. ప్రత్యేకంగా మైక్రోస్కోప్ ఉంటే ఇంకా మెరుగైన సేవలు అందించే వీలుంది.

–డాక్టర్ ఎం. మంజులాబాయి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

తలపై చర్మం ఏర్పాటు చేశారు



నేను కూలీ పనులు చేసుకుని జీవించేదాన్ని. ఇటీవల నాకు బ్రెయిన్‌లో ట్యూమర్ ఉండటంతో ఆపరేషన్ చేశారు. అయితే ఆ సమయంలో పుర్రె పై భాగంలో ఉన్న చర్మం గ్యాంగ్రిన్ వచ్చి దెబ్బతింది. నాకు అప్పుడప్పుడు ఫిట్స్ కూడా వస్తుండటంతో గాయం పెద్దదైంది. మూడు నెలల క్రితం ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి రాగా డాక్టర్లు చేర్చుకున్నారు. అప్పుడు రక్తంలో హిమోగ్లోబిన్ 4 శాతం మాత్రమే ఉంది. నాలుగు ప్యాకెట్లు రక్తం ఎక్కించి మరీ ఆపరేషన్ చేసి తలపై చర్మాన్ని అతికించే ఆపరేషన్ చేశారు. ఇప్పుడు నాకు బాగుంది.

– లక్ష్మీదేవి, దువ్వూరు గ్రామం, వైఎస్‌ఆర్ జిల్లా

ఇక బతకనేమోనని అనుకున్నా..



నేను గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాను. నాకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండు నెలల క్రితం ఓ రోజు గొర్రెలు మేపుతుండటంతో ప్రమాదవశత్తూ విద్యుదాఘాతానికి గురయ్యాను. ఈ ప్రమాదంలో కుడి చేయి పూర్తిగా దెబ్బతినడంతో తీసేశారు. తలకు, కుడి కాలికి గాయం కావడంతో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చికిత్స తీసుకుంటున్నాను. ప్రమాదం జరిగినప్పుడు ఇక బతకనేమోనన్న అనుమానం ఉండేది. డాక్టర్ల వల్ల ఆ పరిస్థితి నుంచి బయటపడ్డాను.

–వెంకటేష్, రేమట గ్రామం, కర్నూలు మండలం

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం పర్యవేక్షక ఇంజనీర్ (డీపీఈ.తిరుపతి) శ్రీనివాసబాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం సిబ్బందితో కలసి విద్యుత్ చౌర్యంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విద్యుత్ చౌర్యంపై తనిఖీలు కూడా చేపట్టారు. స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ 23/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నుంచి సరఫరా అవుతున్న బి.తాండ్రపాడు ఫీడరు, క్యాంపు సెక్షన్ ఓర్వకల్ సెక్షన్‌లలో ఆకస్మికంగా 207 సర్వీస్‌లను తనిఖీ చేశారు. వీటిలో 19 సర్వీస్‌లు అదనపు లోడ్ ఉన్నందున రూ.45000, మరో రెండు సర్వీస్‌లు మాల్ ప్రాక్టీస్ విద్యుత్ చౌర్యానికి సంబంధించి రూ.10000, ఒక సర్వీస్ విద్యుత్ చౌర్యానికి సంబంధించి రూ.2000 ప్రకారం మొత్తం రూ.57 వేలు జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటోందని తెలిపారు. అందువల్ల చౌర్యంపై ఉక్కుపాదం మోపేందుకు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం అదుపులోకి వస్తే వ్యవసాయానికి, పరిశ్రమలకు మరింత నాణ్యమైన విద్యుత్ ఇచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ పీవీ రమణ

కర్నూలు సిటీ: ఇటీవల కాలంలో సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ మోసాలు పెరిగిపోయాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సెట్కూరు సీఈఓ పి.వి. రమణ, దిశా మహిళా పోలీసుస్టేషన్ సీఐ కళా వెంకటరమణ అన్నారు. శుక్రవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో జిల్లా యువజన, సర్వీసుల శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, దిశా మొబైల్ యాప్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ బాధితుల్లో ఎక్కువ శాతం యువకులు, విద్యార్థులే ఉంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి టోల్‌ఫ్రీ నెంబరు 1930కు ఫోన్ చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని సీఐ అన్నారు. కార్యక్రమంలో సెట్కూరు మేనేజర్ జి.సత్యనారాయణ, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ దేవికా రాణి, అధ్యాపకులు జయలక్ష్మి, తదితదరులు పాల్గొన్నారు.

3న సావిత్రీబాయి, ఫాతిమా షేక్ జయంతి వారోత్సవాలు

కర్నూలు(అర్బన్): వచ్చే నెల జనవరి 3వ తేదీన చదువుల తల్లులు సావిత్రీబాయి పూలే, ఫాతిమాషేక్ జయంతి వారోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో జయంతి వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో జయంతి వారోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులు, ఆధునిక సామాజిక ఉద్యమకారులైన వీరి జయంతి వారోత్సవాలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, పలు బీసీ, ప్రజా సంఘాల నాయకులు టి. శేషఫణి, డా.హరిప్రసాద్, ఎరుకల రాజు, రాంబాబు, భారతమ్మ, ఈశ్వరయ్య, కృష్ణోజీరావు, ఉసేన్‌బీ, దస్తగిరమ్మ, అమీనాబీ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో డిజిటల్ సేవలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్

కర్నూలు (అర్బన్): జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేసి పాఠకులకు విశేషమైన సేవలు అందించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన జిల్లాలోని లైబ్రేరియన్లు, ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి గ్రంథాలయ సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, యువత ఎక్కువ సమయాన్ని గ్రంథాలయాల్లో గడిపేందుకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ ఏడాది దాదాపు 15 నూతన గ్రంథాలయ భవనాలను నిర్మించామన్నారు. గ్రంథాలయ సంస్థపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని లైబ్రేరియన్లు, ఉద్యోగులు చైర్మన్ సుభాష్ చంద్రబోస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి కె.ప్రకాష్, ఉద్యోగులు వజ్రాల గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, బషీర్, బాషా, మురళి పాల్గొన్నారు.

అర్హులైన పిల్లలందరికీ టీకాలు వేయాలి

కర్నూలు(హాస్పిటల్): అర్హులైన పిల్లలందరికీ టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన గార్గేయపురం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందిస్తున్న ఆరోగ్యసేవలను అడిగి ఆరా తీశారు. ఐఎల్‌ఆర్‌ను పరిశీలించి అందులో ఉన్న టీకాల స్టాక్‌ను చూశారు. ఇందులో టీకాలు తప్ప ఎలాంటి మందులు ఉండకూడదని ఆదేశించారు. టీకాల స్టాక్‌ను ఎప్పటికప్పుడు యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తూ తక్కువగా ఉన్న టీకాలను వెంటనే డీఐఓ కార్యాలయానికి సమాచారం ఇచ్చి తెప్పించుకోవాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చి గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వారికి ఐరన్ మాత్రలు ఇచ్చారు. రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి వారిని పీహెచ్‌సీలో ఐరన్ సుక్రోజ్ ఎక్కించాలని సూచించారు. బర్త్‌ప్లానింగ్‌లో భాగంగా గర్భిణులను ప్రసవం కోసం ఈడీడీకి 45 రోజుల ముందు ఏ ఆసుపత్రికి వెళ్లాలనే విషయాన్ని కుటుంబసభ్యులతో మాట్లాడి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి బుధ, శనివారాల్లో అన్ని సెషన్స్‌లలో తప్పకుండా ఏఎన్‌ఎం, ఆశాలు టీకాల కార్యక్రమాన్ని ఉదయం 9 గంటల్లోపు ప్రారంభించాలన్నారు.

క్రైం కార్నర్

సెప్టిక్ ట్యాంకులో పడి మహిళ మృతి

కర్నూలు : నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం పారవోలు గ్రామానికి చెందిన లక్ష్మి (35) నగర పరిధిలోని బుధవారపేట పబ్లిక్ టాయిలెట్స్ సెప్టిక్ ట్యాంకులో పడి మృతిచెందింది. లక్ష్మి, ఈశ్వరయ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు, కొడుకు సంతానం. బుధవారపేటలోని పినతల్లి కళావతి, తమ్ముడు రమేష్ ఇంటికి దసరా పండుగకు వచ్చింది. అప్పటినుంచి ఆమె కర్నూలులోనే ఉంటోంది. అప్పుడప్పుడు ఈమెకు ఫిట్స్ వచ్చేవి. శుక్రవారం ఉదయం బహిర్భూమి కోసం బుధవారపేటలోని సామూహిక మరుగుదొడ్డి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంకులో పడి మృతిచెందింది. ఈ మేరకు ఆమె తమ్ముడు దాదెపోగు రమేష్ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి ఆయన మృతిపై విచారణ జరుపుతున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

గొలుసు దొంగలు హల్‌చల్

కర్నూలు: నగర శివారులోని సుంకేసుల రోడ్డులో గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. డాక్టర్ వాసుదేవరెడ్డి తల్లి కృష్ణవేణి మామిదాలపాడు సమీపంలోని ఇండిపెండెంట్ హౌస్‌లో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం సమీపంలోని గుడి నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను సమీపించి మెడలో ఉన్న ఏడు తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించారు. ఆమె అప్రమత్తమై కేకలు వేసేలోగా కనిపించకుండా పారిపోయారు. బాధితురాలు ఈ మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాజీ సైనికుడి మృతి

కర్నూలు(అర్బన్): నగరంలో ని అమ్మ హాస్పిటల్ సమీపంలోని మాధవీనగర్‌లో నివా సం ఉంటున్న మాజీ సైనికు డు ఈశ్వరరెడ్డి (80)మృతి చెందినట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్యచౌదరి శుక్రవారం ఒక ప్రకట నలో తెలిపారు. 15 సంవత్సరాలు ఆర్మీలో పనిచేసిన ఈశ్వరరెడ్డి 40 ఏళ్ల క్రితం పదవీ విరమణ చేశారన్నారు. వయస్సు మీద పడడం వల్ల అనారోగ్యంతో మృతి చెందారన్నారు.

అవీ-ఇవీ

జిల్లా బీసీ సంక్షేమాధికారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆది శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో 9 వేల మంది విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్నారని, ఒక్కో విద్యార్థికి రూ.25 ప్రకారం తనకు ఇవ్వాలని ఆమె వార్డెన్లను బెదిరిస్తోందని, దీంతో వారు మానసిక క్షోభకు గురవుతున్నట్లు చెప్పారు.

రేమదూరులో బొడ్రాయి ఏర్పాటుకు బ్రేక్

కర్నూలు(లీగల్):కల్లూరు మండలం రేమదూరులో నూతనంగా బొడ్రాయి ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన నాయకంటి బజారన్న ఆర్.మద్దయ్య, టి.పుల్లన్న, మరో ఇద్దరు ప్రయత్నించగా ప్రజలకు అసౌర్యమవుతుందని గ్రామ పంచాయతీ సెక్రటరీ నిలుపుదల చేశారు. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించగా కొత్త బొడ్రాయి దారి మధ్యలో ఏర్పాటు చేస్తే ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని శుక్రవారం పేర్కొంటూ విచారణను జనవరి 29కి వాయిదా వేసింది.

మద్యపాన నిషేధ హామీని అమలు చేయాలి

కర్నూలు: సంపూర్ణ మద్యపాన నిషేధం హామీని తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్యల ఆధ్వర్యంలో శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, నగర కార్యదర్శి వరలక్ష్మితో పాటు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్నతో పాటు మహిళలు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ శ్రీలతకు వినతిపత్రమిచ్చారు.

క్లాప్ డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలి

కర్నూలు (టౌన్) : నగర పాలక సంస్థలో పనిచేస్తున్న క్లాప్‌డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాక సంస్థ ఎదుట క్లాప్ డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా నగరం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ సంజీవ్‌కుమార్,ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని, మేయర్ బీవై రామయ్య

- గ్లో గార్డెన్, సీసీ రోడ్లు, పార్కు ప్రారంభోత్సవంలో ప్రజా ప్రతినిధులు

కర్నూలు(టౌన్): ' అభివృద్ధిలో కర్నూలు నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. రూ. వందల కోట్లు వెచ్చించి పార్కులు, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇదంతా అభివృద్ధి కాదా ' అని ఎమ్మెల్యేలు ప్రతిపక్ష పార్టీల నాయకులకు ప్రశ్నించారు. స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని 44 వ వార్డు వెంకటరమణ కాలనీ సమీపంలోని వెంకటాద్రి నగర్‌లో రూ.25 లక్షలు వెచ్చించి పార్కు, సీఐడీ ఆఫీసు, టూరిజం హోటల్, సీతారామనగర్‌లో రూ. 1.10 కోట్లు వెచ్చించి సీసీ రోడ్లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, మురుగు కాల్వలు నిర్మించారు. స్థానిక చిల్డ్రన్ పార్కులో రూ.1.20 కోట్లు వెచ్చించి గ్లో గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క కర్నూలు నగర పాలక పరిధిలోనే రూ.720 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. చిల్డ్రన్స్ పార్కును ఎక్కడా లేని విధంగా గ్లోగార్డెన్ పేరుతో కుటుంబం అంతా సేద తీరే విధంగా తీర్చిదిద్దామన్నారు. మలేషియా, సింగపూర్ నుంచి అద్భుతమైన నమూనాలు, విద్యుత్ కాంతులతో మెట్రోపాలిటన్ సిటీని తలదన్నె విధంగా సుందరీకరించామన్నారు. నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ, డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుకా, నాయకల్ అరుణ, 44వ వార్డు కార్పొరేటర్ రాజేశ్వర రెడ్డి, నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్

ఆడుదాం-ఆంధ్ర క్రీడల నిర్వహణ హర్షణీయం

కర్నూలు (టౌన్) : క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషకర విషయమని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలమైదానంలో 127వ సచివాలయ పరిధిలోని వాలీబాల్ జట్లకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో స్థానిక కార్పొరేటర్ షేక్ అహ్మద్‌తో కలిసి పాల్గొన్న ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు.

పోటీలను ప్రారంభించిన డీఎస్‌డీఓ

ఉస్మానియా కళాశాలలో ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్లు జుబేర్ అహమ్మద్, యూనస్‌బాష ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వమే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించడం, స్పోర్ట్స్ కిట్లు, నగదు ప్రోత్సాహకాలు అందించడం హర్షించదగ్గ విషయమన్నారు.

విజేతల వివరాలు

మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో దండిగేరి సచివాలయానికి చెందిన మోజిత్, నికితల జట్టు 30-12 స్కోర్‌తో స్రవంతి, దివ్యాల జట్టుపై విజయం సాధించింది. పురుషుల విభాగంలో ముజుబుర్ రెహ్మాన్, మహమ్మద్ మజీద్ జట్టు 30-16 స్కోర్‌తో అజ్మతుల్లా ఇర్ఫాన్ జట్టుపై గెలుపొందింది. కోల్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన పురుషుల బ్యాడ్మింటన్ పోటీల్లో కుమ్మరి నాగన్న మఠం సచివాలయానికి చెందిన మజీద్ హుస్సేన్, అంజద్‌బాషా జట్టు 30-18 స్కోర్‌తో వాసుదేవ్, మహమ్మద్ జట్టుపై గెలుపొందింది. నగర శివారులోని ఏపీ రెసిడెన్షియల్ కళాశాల మైదానంలో జరిగిన పురుషుల కబడ్డీ పోటీల్లో స్టాంటన్‌పురం సచివాలయం ఏ జట్టు 28-12 పాయింట్ల తేడాతో ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించింది.

షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : ఈనెల 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించే 42వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొంటున్న షూటింగ్ బాల్ జట్లకు వారు టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
90108 25556
Office mail : sakshiknladvt@gmail.com